# రోడ్ల మరమ్మతులకు రూ.888 కోట్లు అవసరం

## త్వరితగతిన మరమ్మతులు: మంత్రి తుమ్మల



**ఈనాడు, హైదరాబాద్:** తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రహదారులను త్వరిత గతిన మరమ్మతు చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వర్షాల నష్టాలపై బుధవారం ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష జరిపారు. వరదలు, చెట్లు కూలడం వల్ల రాష్ట్రంలో 1170 కిలోమీటర్ల రహదారులు దెబ్బతిన్నట్లు అధికారులు ఆయనకు వివరించారు. వీటి పూర్తిస్థాయి మరమ్మతులకు రూ. 866.33 కోట్లు అవసరమని అంచనా వేశారు. యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేయాలంటే రూ.32.09 కోట్లు కావాలని మంత్రి తెలిపారు. ఇక రాష్ట్రం పరిధిలో ఉన్న జాతీయ రహదారుల మరమ్మతులకు రూ. 22.10 కోట్లు కావాలని, వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ.2.20 కోట్లు అవసరమని మంత్రి తుమ్మల వివరించారు. దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు నిధుల కోసం వెంటనే కేంద్ర ప్రభుత్వానికి సమగ్రంగా నివేదిక పంపాలని అధికారులకు సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా వరద తగ్గకపోవడం, వంతెనలకు ఇరువైపులా కట్టలు తెగడం వల్ల తాత్కాలిక మరమ్మతులు త్వరితగతిన చేయడానికి అవాంతరాలు ఎదురవుతున్నాయని అధికారులు ఆయనకు వివరించారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా వెంటనే పనులు పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు.